లాడ్జీకి వచ్చేశాను.

ఆంధ్రా కిళ్ళీ షాపు దగ్గర ఆంజనేయులు కనిపించాడు.

"ఆంజనేయులుగారూ! మీ గుణశేఖర్ మళయాళం ఫిల్మ్ ప్రివ్యూ వేయిస్తానని వెయ్యి రూపాయలు తీసుకున్నాడు. మూవీ ప్యారడైజ్‌కి ఏడింటికి రమ్మన్నాడు. టోకరా ఇచ్చాడు" అన్నాను.

"మా గుణశేఖర్ ఎవరండీ బాబూ!" అన్నాడు ఆంజనేయులు బిత్తరపోతూ.

"అదేంటి? మీ అసిస్టెంట్‌నని చెప్పాడే" అన్నాను నిర్ఘాంతపోతూ.

"నాకే పనిలేక ఘస్తుంటే నాకొక అసిస్టెంటా? ఏడ్చినట్టుంది. నిజంగానే వాడు మీకు టోకరా ఇచ్చాడు. ఐనా వాడేదో చెప్పగానే నమ్మేయడమేనా? నేను ఎప్పుడూ ఈ బజార్లోనే వస్తుంటాను గదా! నాకొక మాట చెప్పొచ్చుగా. మెద్రాస్‌లో అంతా మాయగాళ్ళనే సంగతి తెలీదా! మీరేం సినిమా బిజినెస్ చేస్తారండీ బాబూ!" అని నాకు క్లాసు పీకాడు ఆంజనేయులు.

నాకు మొఖం వాచిపోయి లాడ్జికెళ్ళి పడుకున్నాను.

కన్నయ్య తనకు టోకరా ఇచ్చిన సంఘటనలు చెప్పాడు రామస్వామితో.

"ఐతే ఒకే రోజు ఇద్దరు నీకు టోకరా ఇచ్చారన్న మాట. భలే అనుభవం" అన్నాడు రామస్వామి.

"ఇంతకీ గమ్మత్తు ఏమిటంటే రెండు రోజుల తర్వాత ఆ ముసలాయన తిరుపతి నుంచి వందరూపాయలు టెలిగ్రామ్ మని ఆర్డర్ పంపించాడు" అన్నాడు కన్నయ్య.

"ఐతే అంతా టోకరా ఇచ్చేబాపతు కాదన్నమాట" అన్నాడు రామస్వామి.

"అదేమరి. టోకరాగాళ్ళ వల్ల నిజంగా అవసరంవుండి అడిగేవాళ్ళని కూడా మోసగాళ్ళేమోనని అనుమానించాల్సి వస్తోంది" అన్నాడు కన్నయ్య.

"నిజమే. అందుకే ఉప్పుకప్పురంబు నొక్కపోలికనుండు అన్నాడు వేమన. తెలుసుకోవడం కష్టమే" అన్నాడు రామస్వామి.

ఇంతలో మాచెర్ల వెళ్ళే బస్సు వచ్చింది. ఇద్దరూ బస్సు ఎక్కారు. డబ్బు తక్కువైనాయని అడిగిన పెద్దమనిషి జాడ లేదు.

-వాణిశ్రీ (హైదరాబాద్)

# ఈ వయసులో...!

దండెమ్మీద వాలిన కాకులు కావు కావుమని రొద చేస్తున్నై. సూర్యోదయమై వుంటుంది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని గోడ గడియారం వంకా చూశా. ఆరుగంటలు దాటి ముప్పై అయిదు నిమిషాలైంది. బారెడు పొద్దెక్కింది. మంచమ్మీద నుంచి లేవాలనిపించలా. అయినా తప్పదు. ఎనిమిది గంటల కల్లా ఆయన టిఫినుకు తయారౌతారు. రెడీ కాలేదంటే, చొక్కా తొడుక్కుని, మూల తిరుగులో వున్న కాకా హోటలికెళ్తానని గొడవ చేస్తారు. చిన్న పిల్లాడిలా అలగటం, రిటైరైన తర్వాత అబ్బిన పిల్లచేష్ట!

మావారు రిటైరై రెండు సంవత్సరాలైంది. తత్పూర్వం తొమ్మిదిన్నరకే ముక్కునా నోటనా అన్నాన్ని కుక్కుకొని, ఆఫీసంటూ పరిగెత్తే మనిషి, రిటైరైన మర్నాటినుంచి రోజు వారీ కార్యక్రమాన్ని మార్పు చేసుకున్నారు. ఉదయాన్నే అల్పాహారం తప్పనిసరైంది. దినపత్రిక ఆమూలాగ్రంగా చదివి పక్కన పెట్టేటప్పటికి ఉదయం దాటి మధ్యాహ్నం అయ్యేది. అప్పటికిగాని కడుపు నకనకలాడేది కాదు. ఆవురావురుమంటూ భోజనం ముగించుకొని, ముందుగదిలో పక్కపై చేరేవారు. గురక మొదలై సాయంత్రం ఆరుగంటలకిగానీ ఆగేది కాదు. కప్పు కాఫీ తాగి, అలా పొలానికి షికారుగా వెళ్ళేవారు. ఇంతవరకూ వారి దైనందిన కార్యక్రమంవల్ల ఇబ్బంది లేదు. కానీ..ఆ తర్వాత నించే ప్రారంభమయ్యేవి 'కష్టాలు(?)' నాకు.


పిల్లలు లేని కొంపలో పన్లు తెమలటం ఎంతోసేపు పట్టదు. యాభైదాటి అయిదువసంతాలైనా, నా ఆరోగ్యానికి ఏ భయం లేదు. అయితే...విశ్రాంతి దినాలు మూడూ హరించుకుపోయినై. ఆయన 'కార్యక్రమాని'కి గండి పెట్టటం నాకసాధ్యమైంది.

* * *

ఉదయం అల్పాహారం సేవించి, పట్టాకుర్చీలో కూర్చున్న మావారికి, చూరులో దోపిన శుభలేఖ కనబడినట్టుంది.

"ఏయ్ లక్ష్మీ! లక్ష్మీ! ఇలారా. ఈ విషయం తెలుసా! మా తమ్ముడి మనమరాలు పెళ్ళీట!"

కాఫీ గిన్నెలు కడిగిన తడి చేతిని కొంగుకు తుడుస్తూ బయటకొచ్చా.



"ఎప్పుడూ?!"

"ఈరోజు సాయంత్రమే! ఆరుగంటలకిట మరి, ప్రయాణానికి సిద్ధంకా"

ఎక్కడో సంబంధం. వెళ్ళాలనే ఉత్సాహం కూడా లేదు. అయినా. ఒకరోజు తప్పినా తప్పినట్టే. నిర్ణయానికొచ్చిందే తడవుగా ప్రయాణానికి సంచీ సర్దటం మొదలెట్టా.

మా గ్రామానికి తెనాలి పది మైళ్ళుంటుంది. రాకపోకలకి బస్సులు తరచుగానే వున్నై. నారింజపండు రంగు చీరె కట్టుకుని, దొడ్లో పూసిన కనకాంబరాలు దండగా కట్టి కొప్పులో సర్దుకున్నా. చేతిలో గుడ్డల సంచీతో ముందుగదిలో కొచ్చా. అప్పటికే ఆయన సిద్ధమై కుర్చీలో కూర్చొనున్నారు.

"అన్ని గదుల తలుపులూ వేశా. మీదే ఆలస్యం"

ఆయన నా వంక చూశారు. అదే 'ఆశ'. ఆయన కళ్ళల్లో కనబడింది. నా ఒళ్ళు వణకటం మొదలెట్టింది. ప్రయాణం మానమంటారేమోనని త్వర త్వరగా పక్కింటి సుబ్బాయమ్మ గార్ని ఇల్లు ఓ కంట కనిపెట్టండని చెప్పి, రోడ్డుపైకొచ్చా, తాళం వేసి, మావారూ నాకూడా వచ్చేరు. ఇద్దరం బస్టాపు దగ్గర చెట్టు కింద నిలబడ్డాం. పది నిమిషాల్లో బస్సొచ్చింది. తెనాలి బయల్దేరాం.

* * *

పెళ్ళి పందిరి అందంగా అలంకరించారు. ఈనగారి తమ్ముడు, ఆయన భార్య ఎదురొచ్చి సగౌరవంగా లోపలికి తీసికెళ్ళారు. పట్టుచీరల గరగరలు, చిన్నపిల్లల రణగొణ ధ్వనుల్తో ఇల్లంతా హడావుడిగా వుంది. భోజనాలు సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటలకి పూర్తయ్యాయి. గదిలో ఓ పట్టాపేసుకొని, మేనువాల్చాను. ప్రయాణ బడలిక, భుక్తాయాసం కునుక్కి స్వాగతించై.

సాయంత్రం నాలుగు గంటల నుంచే పెండ్లివారిళ్ళు హడావుడిగా మారింది. స్నానం ముగించుకొని, చీరమార్చి, వరండాలోకొచ్చా. ఆయన కుర్చీలో నిద్దరోతున్నారు.

"ఏమండీ! మిమ్మల్నే! లేచి స్నానం చేసి గుడ్డలు మార్చుకోండి" కుర్చీ దగ్గరగా నిల్చొని చిన్నగా తట్టి లేపాను. నా వంక ఓ మారు చూశారు. కళ్ళలో 'అదే యావ' కొట్టొచ్చినట్టు కనబడింది. దూరంగా జరిగి, చేతికి తుండందించి, కావాలని లోనికెళ్ళా.

స్నానం ముగించి, పెళ్ళికి సిద్ధమైనారు. వివాహ వేదిక దగ్గరగా, ఆడవాళ్ళలో చేరాను.

మంగళ వాయిద్యాల మధ్య, మాంగళ్యధారణ అయిపోయింది. మిగతా తతంగంతో అంతగా పనిలేనివాళ్ళంతా, భోజనాల ఏర్పాట్లు గురించి హడావుడి పడుతున్నారు.

భోజనాలు ఎనిమిది గంటలకి ముగించి, వారికి లుంగీ ఇద్దామని వరండాలో కొచ్చి లుంగీ చేతికందించా.

"ఏంటిది? ఇప్పుడెందుకూ? ఊరికి బయల్దేరదాం..గుడ్డలు సర్దు"

అవాక్కైపోయా. రాత్రి జాగరణ తప్పదనిపించింది. నీరసంగా, సంచీ కోసం లోపలికెళ్ళా.

ఇంటికి చేరి 'పన్లు' పూర్తయ్యేటప్పటికి పదకొండైంది. అప్పుడే ఒక నిర్ణయానికొచ్చా... డాక్టరుగారి సలహా తీసుకోవాలి.

* * *

మధ్యాహ్నం భోం చేసి, ఆయన ముందు గదిలోకెళ్ళారు. వారు తిన్న కంచం కడిగి, నా భోజనం కూడా ముగించి, డాక్టరు అడ్రసు కోసం పక్కింటినుంచి తెచ్చిన వారపత్రిక కోసం చూశా. పోపుపెట్టె మీదుండాల్సిన పత్రిక కనబడలా! ఇక్కడా అక్కడా వెతికా. ఊహూ..కనబడలా. ముందు గదిలోకి తొంగి చూశా. నిశ్చేష్టురాలైనా! విలాసంగా పక్కకు ఒత్తిగిలి, శృంగార కథ చదువుతూ, విలాసంగా కాళ్ళాడిస్తున్న ఈయన్ని చూస్తూనే అచేతనురాలనైపోయా!

-డి.మల్లికార్జునరావు